కొడంగల్ నుంచి యాచారం మండలం మేడిపల్లికి వచ్చిన ఫార్మాసిటీ బాధిత రైతులు

'కొడంగల్'లో ఫార్మాసిటీని ఒప్పుకోం

- ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
- మేడిపల్లి వెళ్లిన దుద్యాల ఫార్మా బాధితులు
- అక్కడి ఉద్యమ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని నిర్ణయం

యాచారం, సెప్టెంబర్ 5 : సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మాసిటీని అడ్డుకునేందుకు బాధిత రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా ఆందోళనలు, నిరసనలు చేపట్టిన కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట, పోలేపల్లి, ఆర్బీతండా, పులిచర్లకుంటతండా, ఈర్లపల్లితండాకు చెందిన పలువురు రైతులు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించారు. గతంలో యాచారం మండలంలోని అక్కడి బాధిత రైతులు అడ్డుకున్న విధంగానే తాము ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ఈ మేరకు గురువారం రైతులు యాచారం మండలంలోని మేడిపల్లి గ్రామానికి వెళ్లి అక్కడి ఫార్మాసిటీ బాధిత రైతులు, నాయకులతో సమావేశమయ్యారు. గతంలో యాచారం, కందుకూరు మండలాల్లో అప్పటి ప్రభుత్వం హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పేరుతో ఏర్పాటుకు ప్రయత్నించగా.. వారు ఎంచుకున్న ఉద్యమ కార్యాచరణ, అడ్డుకున్న విధానం, నష్టపరిహారం, వ్యతిరేక ఉద్యమాలపై ఆరా తీశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా సిటీ ఏర్పాటును అడ్డుకుంటామని స్పష్టంచేశారు. గోబ్యాక్ ఫార్మా అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పచ్చని పంట పొలాల్లో ఫార్మా విషం ఏంటని ప్రశ్నించారు. కొడంగల్‌లో ఫార్మాను అడ్డుకొని తీరుతామని స్పష్టం చేశారు. కొడంగల్ సెగ్మెంట్‌లో 1,375 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తామని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే.

- దేవుడా.. ఫార్మాసిటీని అడ్డుకోండి

మంచిగా పంటలు పండుతున్న తమ భూముల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేయకుండా అడ్డుకోవాలని దేవుడిని కోరుతూ భూబాధితులు గ్రామ దేవతలకు పూజలు చేశారు. గురువారం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్‌లో ఫార్మాసిటీ భూబాధితులు, గ్రామస్థులు కలిసి భాజాభజంత్రీల మధ్య ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కులమతాల కతీతంగా భూబాధితుల కుటుంబ సభ్యులు గ్రామ దేవతల ఆలయాలు, చర్చిలు, మసీదులు, దర్గాల్లో పూజలు, ప్రార్థనలు చేశారు. ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తే తమ బతుకులు ఆగమవుతాయని, ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా దీవించాలని మొక్కుకున్నారు. – న్యాల్‌కల్

- పాలబిల్లుల కోసం ధర్నా

పెండింగ్ పాల బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాడి రైతులు రోడ్డెక్కారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మార్చాల గేట్ వద్ద కోదాడ-జడ్చర్ల ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా క్యాన్లలో ఉన్న పాలను రోడ్డుపై పారబోసి నిరసన తెలిపారు. విజయా డెయిరీకి పాలుపోస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బిల్లులు చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. – కల్వకుర్తి

- కరెంట్ కోసం ఏఈ ఆఫీస్ ఎదుట నిరసన

విద్యుత్తు అధికారులు కరెంట్ సరఫరా నిలిపి వేయడంతో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లోని సుభాష్‌నగర్ కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం వారు స్థానిక ఏఈ కార్యాలయం ఎదుట బైఠాయించారు. – భీమ్‌గల్

- బ్యాంకు అధికారుల తీరుపై రైతుల ఆందోళన

'రుణమాఫీ కోసం బ్యాంకుకు వెళ్తే వడ్డీ డబ్బులు కట్టించుకొని రసీదు ఇస్తలేరు.. క్రాప్ లోన్ రెన్యువల్ కోసం నెల రోజుల తర్వాత రమ్మంటున్నారు' అని బ్యాంకు అధికారుల తీరుపై మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం వారు మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లితోపాటు పలు గ్రామాల రైతులు నెల్లికుదురు ఎస్‌బీఐ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోన్ స్టేట్‌మెంట్, లోన్ వడ్డీ చెల్లించడానికి రోజుల తరబడి బ్యాంకు చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. – నెల్లికుదురు

ఈ గురుకులం మాకొద్దు!

నిర్వహణ వైఫల్యంతో ఖాళీ అవుతున్న గురుకులాలు

- బర్ల దొడ్డి కన్నా అధ్వానంగా హాస్టళ్లు
- టీసీలు తీసుకెళ్లిపోయిన ఏడుగురు విద్యార్థులు
- మిగిలినవారూ ఒక్కొక్కరుగా గుడ్‌బై!
- కందుకూరు గురుకులాన్ని సందర్శించిన మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి
- నిర్వహణలోపంపై సర్కారును నిలదీత

వర్షం నీళ్లతో విద్యార్థులు పడుకునే గది

మహేశ్వరం, బడంగ్‌పేట, సెప్టెంబర్ 5: నిర్వహణ వైఫల్యంతో గురుకులాలన్నీ ఖాళీ అవుతున్నాయి. హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించకపోవటం, నాసిరకం ఆహారం.. తదితర కారణాలతో విద్యార్థులు గురుకులాలకు గుడ్‌బై చెప్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని గురుకులాల్లో ఇవే పరిస్థితులు. సర్కారు నిర్వహణ లోపం వల్లే తమ పిల్లల టీసీలు తీసుకెళ్లిపోతున్నామని విద్యార్థులు తల్లిదండ్రులు చెప్తున్నారు. ఇలాంటి గురుకులంలో ఉండలేమంటూ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని నాదర్‌గుల్‌లో ఉన్న కందుకూరు గురుకులానికి చెందిన ఏడుగురు విద్యార్థులు టీసీలు తీసుకెళ్లిపోయారు. దీంతో పరిస్థితులు తెలుసుకొనేందుకు మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి ఆ గురుకులాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పడుతున్న అవస్థలు చూసి ఆమె చలించిపోయారు. నిర్వహణ సరిగా లేక హాస్టల్ గదులు, క్లాస్ రూమ్‌లు దుర్గంధంతో నిండిపోయాయి. కొంతమంది విద్యార్థులు జ్వరంతో నేలపైనే పడుకోవటం చూసి ఆవేదన చెందారు.

ఇదేం హాస్టల్: సబితాఇంద్రారెడ్డి

'ఇదేం హాస్టల్.. గదుల్లో కిటికీలు, తలుపులు, ఫ్యాన్లు సక్రమంగా లేవు.. మరుగుదొడ్ల నుంచి పిల్లల గదుల్లోకి తీవ్ర దుర్గంధం.. వర్షం వస్తే గదుల్లో నీరు.. అక్కడే పిల్లలు ఉండాల్సిన దుస్థితి.. బర్ల దొడ్డికన్నా ఈ హాస్టల్ అధ్వానంగా ఉన్నది' అని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం కందుకూరు గురుకుల హాస్టల్‌ను సందర్శించిన ఆమె.. విద్యార్థుల దుర్భర పరిస్థితిని చూసి చలించిపోయారు. హాస్టల్ అంతా కలియదిరిగి మరుగుదొడ్లు, మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. జ్వరంతో బాధపడుతున్న పిల్లలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. 550 మంది విద్యార్థులు చదువుకునే హాస్టల్‌లో ఇన్ని సమస్యలు ఉంటే ఎందుకు పట్టించుకోవడం లేదని పాలకులను ప్రశ్నించారు. కనీసం తాగడానికి మంచినీళ్లు కూడ లేకపోతే ఎలా? అని నిలదీశారు. విద్యార్థులు చదువుకోవటానికి కనీసం బెంచీలు, టేబుళ్లు లేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. హాస్టల్‌ను సందర్శించిన సందర్భంగా సబితకు విద్యార్థులు తమ సమస్యలు చెప్పుకున్నారు. తరగతి గదుల్లో కూడా దుర్గంధ వాసన వస్తున్నదని, దోమలు విపరీతంగా ఉన్నాయని తెలిపారు. అక్కడికొచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఎమ్మెల్యేలకు తమ పిల్లల ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. వెంటనే ఆమె ఉన్నతాధికారులకు ఫోన్ చేసి అక్కడి సమస్యలను వివరించారు. శుక్రవారమే వచ్చి ఫర్నిచర్ ఇతర సమస్యలను తీరుస్తామని ఎమ్మెల్యేకు అధికారులు తెలిపారు. బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్ రఘుకుమార్, ఏఈ వినీల్‌గౌడ్‌ను రప్పించి అవుట్‌లేట్ ఏర్పాటు చేయడానికి డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ ఏర్పాటు చేయించాలని ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో చైర్మన్ నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు సూర్ణగంటి అర్జున్, యాతం పవన్‌కుమార్, సుక్క శివకుమార్, కోఆప్షన్ జగన్‌మోహన్‌రెడ్డి, బడంగ్‌పేట బీఆర్ఎస్ నాయకులు రామిడి రాంరెడ్డి, బీమిడి జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనలో సర్కారు విఫలం

నాదర్‌గుల్‌లో ఉన్న గురుకులంలో 550 మంది విద్యార్థులు ఉన్నారు. జూనియర్ కళాశాల కూడా ఇదే భవనంలో ఉన్నది. సౌకర్యాలు కల్పించటంలో సర్కారు విఫలం కావటంతో.. విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ ముందు ధర్నా చేసినా ఫలితం లేకపోయింది. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితి మారలేదు. వర్షాలతో గదుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతున్నది. కనీస సమస్యలు కూడా పరిష్కరించకపోతే పిల్లలను ఎలా చదివించాలని పేరెంట్స్ కమిటీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. నాసిరకం భోజనం పెడుతున్నారని, బాలుర హాస్టల్‌లో డైనింగ్ లేక పిల్లలు నేలపైనే కూర్చొని తిన్నాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని వెల్లడించారు.

రోడ్డెక్కిన గౌలిదొడ్డి గురుకుల విద్యార్థులు

- ఉపాధ్యాయుల వినోత్సవం రోజే నిరసన
- తరగతులు బహిష్కరించి ఆందోళన బాట

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 5: 'సీనియర్ ఫ్యాకల్టీలను మార్చొద్దు.. మా భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయొద్దు.. అని ఉపాధ్యాయుల దినోత్సవం రోజే గౌలిదొడ్డి గురుకుల కళాశాలల విద్యార్థులు రోడ్డెక్కారు. హైదరాబాద్ శేరిలింగంపల్లిలోని గౌలిదొడ్డి సాంఘిక, సంక్షేమ ఐఐటీ ఇంటర్ బాలుర కళాశాల విద్యార్థులు తరగతులను బహిష్కరించి, క్యాంపస్ గేటు ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళనను విరమించేది లేదని విద్యార్థులు తేల్చిచెప్పారు. గురుకుల విద్యాలయాల సెక్రటరీ ఈ విషయమై వెంటనే స్పందించాలని కోరారు. కొద్దిసేపటికే సమీపంలోని బాలికల గురుకుల విద్యార్థులు సైతం తరగతి గదుల నుంచి విద్యాలయం గేటు ముందు జర్నలిస్టు కాలనీ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. పరీక్షల సమయం దగ్గరపడుతున్న వేళ కొత్తవారిని నియమించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ సమస్యలను పట్టించుకోకుండా గురుకుల విద్యాలయాల సెక్రటరీ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ విద్యార్థులను అణగతొక్కేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని తల్లిదండ్రులు ఆరోపించారు.

ఏఐ అంతర్జాతీయ కేంద్రంగా హైదరాబాద్

- ఫోర్త్ సిటీలో 200 ఎకరాల్లో ఏఐ సిటీ ఏర్పాటు
- 26 సంస్థలతో ఒప్పందాలు

సమ్మిట్‌లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, వివిధ దేశాల ప్రతినిధులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరాన్ని కృత్రిమ మేధస్సు(ఏఐ)కి అంతర్జాతీయ కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. అందులో భాగంగానే తమ ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న ఫోర్త్ సిటీలో ఏఐ కార్యకలాపాల కోసం 200 ఎకరాలను కేటాయించిందని చెప్పారు. హెచ్ఐసీసీలో గురువారం రాష్ట్ర ఐటీ శాఖ నిర్వహించిన ఏఐ గ్లోబల్ సమ్మిట్‌ను ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వస్తున్న కొత్త టెక్నాలజీలతో సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని అన్నారు. తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ సైతం కొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా మారిందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఏఐకి ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించిన తమ ప్రభుత్వం ఏఐ కార్యకలాపాల కోసం ఫోర్త్ సిటీలో 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. వ్యవసాయం, వైద్య, ఆరోగ్యం, విద్య, ప్రజా రవాణా వ్యవస్థల్లో ఏఐ వినియోగంపై ఇండస్ట్రీ నిపుణులతో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. ఏఐ సిటీ నిర్మాణం పూర్తయ్యే వరకు శంషాబాద్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రంలో రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అన్ని సౌకర్యాలతో కూడి కార్యాలయ స్థలాన్ని ఏఐ ఆధారిత కంపెనీల కోసం అందుబాటులో ఉంచుతామని చెప్పారు. వివిధ సంస్థలతో 26 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. రెండ్రోజులు జరిగే సదస్సులో 50కి పైగా స్టార్టప్‌లతో ప్రదర్శన ఏర్పాటు చేశారు.

రైస్ మిల్లర్ల సంఘంలో చీలిక

రారైస్, బాయిల్డ్‌రైస్ మిల్లర్లుగా ఏర్పాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ రెండుగా చీలిపోయింది. రారైస్, బాయిల్డ్ రైస్ మిల్లర్లుగా విడిపోయారు. ఇందులో భాగంగానే పాత అసోసియేషన్ నుంచి బయటకొచ్చిన రారైస్ మిల్లర్లు వేరుగా 'రాష్ట్ర రారైస్ మిల్లర్ల అసోసియేషన్'ను ఏర్పాటు చేసుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వరంగల్‌కు చెందిన గణపతిరెడ్డిని ఎన్నుకున్నారు. పాత అసోసియేషన్‌లో కీలక పోస్టులన్నీ బాయిల్డ్ రైస్ మిల్లుల ఓనర్లే దక్కించుకునేవారని, తమకు అవకాశం ఇవ్వలేదని రారైస్ మిల్లర్లు ఆరోపిస్తున్నారు. తమ సమస్యలను తామే పరిష్కరించుకోవాలనే అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు.

హెచ్ఐసీసీ వేదికగా జరిగిన ఏఐ గ్లోబల్ సమ్మిట్‌లో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

ఏఐ గ్లోబల్ సమ్మిట్‌లో ఖాళీ కుర్చీలు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఏఐ గ్లోబల్ సమ్మిట్ ఆశించిన విజయం సాధించలేదనడానికి సదస్సులో కనిపించిన ఖాళీ కుర్చీలే నిదర్శనం. రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసుకున్నా, సదస్సు కోసం రూ.9.45 కోట్ల బడ్జెట్ కేటాయించినా.. కార్యక్రమానికి స్పందన కరువైంది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో నిర్వహించిన సదస్సు ప్రధాన హాలులో ఏర్పాటుచేసిన కుర్చీల్లో 30 శాతం ఖాళీగానే కనిపించాయి. సీఎం రేవంత్, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు సభావేదికపై ఉన్నప్పుడే ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఐటీ రంగ ప్రముఖులు, ప్రపంచ దిగ్గజ కంపెనీలు పాల్గొంటాయని చెప్పినా, 4-5 ప్రముఖ కంపెనీల ప్రతినిధులే తప్ప, మిగతావాళ్లంతా స్టార్టప్ కంపెనీల ప్రతినిధులే వచ్చారు. ఇక ఐఅండ్‌పీఆర్ ప్రతినిధిగా ఉన్న డిప్యూటీ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు తమ పట్ల దురుసుగా ప్రవర్తించారని కొంతమంది జర్నలిస్టులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమం కవరేజ్‌కు ఆహ్వానించి.. మీడియా పట్ల దురుసుగా ప్రవర్తిస్తారా అంటూ విమర్శించారు.

మేడం ఎక్కడో ఆ మేనేజర్ అక్కడే!

- సోషల్ వెల్ఫేర్‌లో డిప్యుటేషన్‌పై ఎఫ్ఎం కిరణ్మయి
- టెస్కో, ఆయుష్‌లోనూ ఇదే సెక్రటరీ వద్ద విధులు
- అడ్డగోలుగా ఆరోపణలు.. కో ఆపరేటివ్ సొసైటీ విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్5 (నమస్తే తెలంగాణ): సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో మరో అడ్డగోలు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. సొసైటీ సెక్రటరీ విధులు నిర్వర్తించే చోటుకే ఓ అధికారిణి వాలిపోవడమే అందుకు కారణం. అందులో ఆంతర్యమేమిటని? సొసైటీ ఉన్నతాధికారులే కాదు, ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీ ఫైనాన్స్ విభాగంలో అడిషనల్ సెక్రటరీగా కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ జాయింట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ కిరణ్మయిని నియమిస్తూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులను జారీచేసింది. సొసైటీ సెక్రటరీ అలుగు వర్షిణి ఎక్కడ పనిచేస్తే అక్కడికి ఈ అధికారి వాలిపోవడం గమనార్హం. సొసైటీ సెక్రటరీ వర్షిణి గతంలో ఆయుష్ విభాగంలో పనిచేయగా ఇదే కిరణ్మయి ఆమె వద్ద విధులు నిర్వర్తించారు. అనంతరం అక్కడి నుంచి చేనేత జౌళిశాఖకు వెళ్లగా అక్కడికి సైతం కిరణ్మయి డిప్యూటేషన్‌పై వెళ్లారు. ప్రస్తుతం సోషల్ వెల్ఫేర్ సెక్రటరీగా వర్షిణి విధులు నిర్వర్తిస్తుండగా, మళ్లీ ఇదే సొసైటీకి డిప్యుటేషన్‌పై అడిషనల్ సెక్రటరీగా రావడం కొసమెరుపు. ఇదే ఇప్పుడు ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గురుకుల సొసైటీ సెక్రటరీగా అలుగు వర్షిణి మే నెలాఖరులో బాధ్యతలు చేపట్టారు. ఆ వెంటనే నెలరోజులు తిరగకుండానే సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు సీనియర్ అడిషనల్ సెక్రటరీ అవసరమని, అందుకు డాక్టర్ కిరణ్మయిని నియమించాలని కోరుతూ ప్రభుత్వానికి ఆమె లేఖ పెట్టడం గమనార్హం. దానికి ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. మేడం ఎక్కడికి వెళ్తే కిరణ్మయి సైతం అక్కడికే వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇద్దరి మధ్య అంతటి అనుబంధమేమిటోనని అనేక విధాలుగా చర్చించుకుంటున్నారు.

ఆరోపణలెన్ని వచ్చినా ఆగని డిప్యుటేషన్లు

సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రటరీగా డిప్యూటేషన్‌పై నియమితులైన డాక్టర్ కిరణ్మయిపై అనేక ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినా ఆమె డిప్యూటేషన్లు ఆగకపోవడం గమనార్హం. ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులే కాదు, చేనేత జౌళిశాఖ ఉద్యోగులు సైతం బాహాటంగానే పలు విమర్శలు చేశారు.

ఆమరణ దీక్షలకు దిగుతాం

- గురుకుల పార్ట్‌టైం, గెస్ట్ ఫ్యాకల్టీల స్పష్టీకరణ
- రెండో రోజూ సొసైటీ కార్యాలయం ఎదుట ధర్నా

హైదరాబాద్, సెప్టెంబర్5 (నమస్తే తెలంగాణ): అర్థాంతరంగా తొలగించిన తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి, లేదంటే ఆమరణ దీక్షలకు దిగుతామని గురుకులాల నుంచి ఇటీవల తొలగింపునకు గురైన సిబ్బంది స్పష్టంచేశారు. ఈ మేరకు తమను విధుల్లోకి తీసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీల్లోని సీవోఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్), నాన్ సీవోఈలు, ప్రత్యేక గురుకులాలు, వొకేషనల్ గురుకులాల పార్ట్‌టైం, గెస్ట్ ఫ్యాకల్టీ, సబ్జెక్ట్ అసోసియేట్లు, ఫిజికల్ డైరెక్టర్లు రెండోరోజైన గురువారం సొసైటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సెక్రటరీ నిర్ణయంతో 6,500 మంది కుటుంబాలు రోడ్డున పడ్డాయని, 3 నెలలుగా వేతనాలు కూడా చెల్లించలేదని, ఇదేమని అడిగినందుకు కక్షగట్టి విధుల నుంచి తొలగించారని తెలిపారు. ఉదయం నుంచి నిరీక్షించినా ఏమాత్రం లెక్కచేయకుండా సెక్రటరీ, ఇతర అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

అగ్రికల్చర్ కాలేజీల్లో లెక్చరర్ పోస్టులు

ఈ నెల 13వరకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, సెప్టెంబర్5 (నమస్తే తెలంగాణ) : మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని వనపర్తి, కరీంనగర్ అగ్రికల్చర్ మహిళా డిగ్రీ కళాశాలల్లో పలు అధ్యాపక పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి సైదులు గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. అగ్రానమీ 2, లైవ్‌స్టాక్, యానిమల్ హస్బెండరీ 2, జెనెటిక్స్, ప్లాంట్ బ్రీడింగ్ 2, ఎంటమాలజీ 2, అగ్రికల్చర్ ఎకనామిక్స్ 2, ప్లాంట్ పాథాలజీ 2, అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ 2 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు వెల్లడించారు. ఎమ్మెస్సీ అగ్రికల్చర్, పీహెచ్‌డీ చేసిన మహిళా అభ్యర్థులు అర్హులని, ఆసక్తి గలవారు ఈ నెల 13లోగా రెస్యూమ్, అకడమిక్ ప్రొఫైల్‌ను mjpkrnagbsc2022@gmail.comకు మెయిల్ చేయాలని, దరఖాస్తు చేసుకున్న వారికి డెమో/ఇంటర్వ్యూ నిర్వహించి సెలెక్ట్ చేయనున్నట్టు వెల్లడించారు. పూర్తి వివరాలకు 7680941504నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆరుగురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎదురుకాల్పులు
- మృతుల్లో అగ్రనేత లచ్చన్న దంపతులు
- జనజీవనంలోకి రావాలని డీజీపీ పిలుపు

ఘటనా స్థలానికి వెళ్తున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

కరకగూడెం/కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 5: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కరకగూడెం మండలం ఏజెన్సీ ప్రాంతం గురువారం తెల్లవారుజామున తుపాకీల మోతలతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పచ్చని చెట్లపై రక్తపు మరకలు చిందించింది. రఘునాథపాలెం, మోతే, తాటిగూడెం సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, గ్రేహౌండ్స్ బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు హతమయ్యారు. భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు కథనం ప్రకారం.. ఆ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో గ్రేహౌండ్స్ పోలీసులు గాలింపు చేపట్టారు. గ్రేహౌండ్స్ బలగాలను గమనించిన మావోయిస్టులు కాల్పులకు దిగారు. అప్రమత్తమైన గ్రేహౌండ్స్ బలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. కాల్పుల విరమణ తర్వాత ఘటనా స్థలాన్ని అధీనంలోకి తీసుకున్న గ్రేహౌండ్స్ బలగాలు.. ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించాయి. మృతుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత, మణుగూరు ఏరియా కార్యదర్శి లచ్చన్న దంపతులు కూడా మృతి చెందారు. వీరిపై రివార్డులు ఉన్నట్టు ఎస్పీ తెలిపారు. ఘటనా స్థలం నుంచి ఏకే 47 తుపాకులు 2, ఎస్ఎల్ఆర్ 1, 303 రైఫిల్ 1, పిస్టల్ 1, మ్యాగజైన్‌తోపాటు లైవ్ రౌండ్లు, కిట్ బ్యాగులు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎదురుకాల్పుల్లో ఇద్దరు గ్రేహౌండ్స్ పోలీసులకు తీవ్ర గాయాలు కావడంతో భద్రాచలం ఏరియా దవాఖానకు తరలించామని తెలిపారు. ఒక మావోయిస్టు పారిపోయినట్టు పేర్కొన్నారు.

ముగ్గురు మంత్రులదే బాధ్యత: ఆజాద్

రఘునాథపాలెం ఎన్‌కౌంటర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వంతోపాటు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు బాధ్యత వహించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హత్యలకు త్వరలోనే నెత్తుటి బాకీ తీర్చుకుంటామని హెచ్చరిస్తూ మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు జిల్లా డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పేరుతో గురువారం లేఖ విడుదలైంది. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు కామ్రేడ్‌లతోపాటు ఓ గ్రామస్థుడు చనిపోయినట్టు పేర్కొన్నారు. ఈ ఘటనలో రాయిగూడెం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం డివిజన్ కమిటీ సభ్యుడు లచ్చన్న, ఆయన సతీమణి తులసి అలియాస్ పూనెం లక్కీ, పాల్వంచ-మణుగూరు ఏరియా కమిటీ కమాండర్ రాము, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కోమటిపల్లికి చెందిన పార్టీ సభ్యురాలు కోసి, గంగాల్, పార్టీ సీనియర్ సభ్యుడు, బొట్టెంకు చెందిన దుర్గేశ్ అమరులయ్యారని తెలిపారు. ఈ నెల 9న బంద్‌కు పిలుపునిస్తున్నట్టు పేర్కొన్నారు.

జనంలోకి రండి: డీజీపీ పిలుపు

తెలంగాణకు చెందిన మావోయిస్టు కార్యకర్తలు, అధినాయకత్వం జనజీవన స్రవంతిలోకి రావాలని డీజీపీ జితేందర్ కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కర్కగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోత